# చేదుకూడా ఒక రుచే

సుందరం మరోసారి కొంచెం దూరంలో బంతి [illegible] ఆడుతూన్న చిన్నపిల్లనీ, ఆమెతో సమంగాఆడుతూ ఆనందిస్తూన్న ఆ యువతినీ చూశాడు, నిట్టూర్పుతో అతను కళ్ళు తిప్పుకున్నాడు.

ఇంకా నాలుగు గంటలు కూడా అవలేదు. కాని, ఎండ తీవ్రత చాలావరకు తగ్గింది. లాన్స్ కొంచెం తడిపి నట్టున్నారుః చల్లగా ఉన్నాయి. సూర్యకిరణాల కాంతిలో విక్టోరియా మెమోరియల్ కొత్తగా కనిపిస్తూంది.

అవతల రోడ్ల మీద కార్లూ, ప్రజలూ వస్తూపోతూ ఉన్నారు. మైదానంలో చాలామంది కూర్చునీ, గేమ్స్ ఆడుతూనూ, షికారు చేస్తూనూ ఈ ఆదివారం సాయంత్రాన్ని గడుపుతున్నారు. ఎలుక కలుగుల్లాటి ఇళ్ళలో నించి ఊడిపడి ఈ కొంచెంసేపు అయినా గాలి పీల్చుకొనేందుకు ఈ లాన్సూ ఈ మైదానమూ ఈ మహానగరంలో వీళ్ళలో చాలా మందికి ఏకైక శరణ్యం అయినా, శ్రీమంతులూ, విలాస వంతులూ, ప్రేమించుకునే యువతీ యువకులూ, భగ్న

ప్రేమికులూ అందరూ ఇక్కడికి వస్తారు. కార్లలో, టాక్సీలలో, గుర్రపుబళ్ళలో, నడిచీ, వాళ్ళు వస్తారు. ఇక్కడ చల్లటి, స్వచ్ఛమైన గాలి ఉంటుందని చాలామంది నమ్మిక. గంటకి వేల లెక్కలో చుట్టు ప్రక్కల రోడ్లలో తిరుగుతూ విష తుల్యమైన పొగలతో కార్లూ, ఇతర వాహనాలూ నిష్పక్షపాతంగా ఈ గాలిని కూడా కలుషితం చేస్తూనే ఉన్నా, మిగిలిన చోట్లతో సరిపోల్చి కొందరూ ఆలోచించ కుండానే చాలామందీ ఇక్కడి గాలి పీల్చుకునేందుకూ, రంగులు చూసేందుకూ రోజూ వస్తూనే ఉంటారు.

ఆదివారాలు సరే సరి.

తనలాగ చాలామంది ఆదివారాలలో ఇక్కడికి వస్తారనీ, తనకి లాగే అది వాళ్ళందరికీ అలవాటయి పోతుందనీ సుందరం అనుకున్నాడు. మూడేళ్ళ నించి అతను ప్రతీ ఆదివారం విధిగా విక్టోరియా మెమోరియల్‌కి వచ్చి, లాన్‌లో సుమారు అదే చోట కూర్చిని సరిగ్గా అయిదున్నరకి లేచి వెళ్ళడం అలవాటు అయి పోయింది - వర్షాకాలంలో తప్ప.

అటు ఆడుకొంటూన్న చిన్న అమ్మాయి బంతి తన వేపుకి విసిరి, దాని వెనక పరిగెట్టి, తనకి దగ్గరగా వచ్చి భయంతో, సందేహంతో ఆగిపోయి తల్లివైపు చూసింది.

సుందరం బంతిని మృదువుగా పిల్లవైపు తోసి, అమె దాన్ని పట్టుకుని పరిగెత్తి పారిపోవడం చూసి బాధగా నవ్వుకున్నాడు. అల వాటు ప్రకారమూ ఆ పిల్ల తండ్రి ఇంకో పది నిమిషాలలో రావాలి. అతన్ని చూసినప్పుడల్లా, "ఎంత అదృష్టవంతుడు!" అనిపిస్తుందతనికి.

ఇంత మంది మధ్య ఒంటరిగా కూర్చుని, భార్య పిల్లలు అనేవి లేకుండా యాంత్రికంగా తన కాలం ఎలాగ గడిచిపోతూందో ఆలోచిస్తే మరీ బాధగా ఉంటుంది. వారమంతా ఉద్యోగం, హోటళ్ళలో భోజనాలు.... ఆదివారం ఈ గంటన్నరా ఇక్కడ. ఆతరవాత స్నేహితులు....

ఆర్థికంగా తనకి ఇబ్బంది ఏమీలేదు.. జీతం బాగానేవస్తుంది. అటు అన్న ఒక్కడే తనకి ఉన్నది. అమ్మా, నాన్నా ఏనాడో వెళ్ళి పోయారు. అన్నకి బాధ ఏమీలేదు. భూమీ, ఇల్లూ అన్నీ అతను అనుభవిస్తూనే ఉన్నాడు.. మరి తనకి లేని అవసరాలు అతనికి ఉన్నాయి. పిల్లలు, సంసారం, ఖర్చులు - ఏది ఏమయినా, తనకి అలాటి బాధలులేవు.

ఉంటే బాగుండును.. అనిపిస్తూ ఉంటుంది సుందరానికి. రాత్రి ఇంటితాళం తీసుకుని లోపలికి అడుగు పెట్టినప్పుడూ, ఉదయం సర్వెంట్ పిలుపుకి కళ్లు నులుముకుంటూ లేచి తలుపు తీసినప్పుడూ, ఇలాగ ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తూంటేనూ, అలాగ తియ్యటి

చిన్న అమ్మాయి బంతి ఆడుకుంటూ కనిపించినపుడూనూ...

సుందరం మళ్ళీ నిట్టూర్చి చుట్టూ చూశాడు.

చాలామంది గ్రౌండ్స్‌లో అటూ ఇటూ తిరుగుతున్నారు.

అందరినీ పరధ్యానంగా పరిశీలిస్తున్న అతని కళ్లు హఠాత్తుగా ఒక మనిషి దగ్గర ఆగిపోయాయి.

అతని శరీరంలో విద్యుత్ ప్రవహించినట్లు అయి, కొన్ని క్షణాలు అతను అచేతనుడై పోయాడు.

"అసంభవం..." అనిపించింది సుందరానికి.

కళ్లు తుడుకుకుని, తాను చూసినది లావణ్యనికాదనీ, అమెని పోలిన మరో మనిషిననీ తనకి తాను నచ్చ చెప్పుకోబోయాడు సుందరం. కాని, అతను మళ్ళీ మళ్ళీ అటు చూడకుండా ఉండలేక పోయాడు. చూసిన కొద్దీ ఆమె లావణ్యేనని మరికొంత నిశ్చయం అవుతూంది.

ఎంతకాలం అయింది ఆమెని చూసి! ఒక నెల అటో ఇటో ఆరేళ్లు... ఈ సమయంలో ఆమెలో సంపూర్ణత్వం వచ్చింది. విగ్రహంలో అప్పుడు లేని నిండుదనం ప్రస్ఫుటంగా ఈ దూరం నించీ కనిపిస్తూంది.

లావణ్య...

అంత భేదంఉన్నా, వయసొచ్చిన అమ్మాయినించి యువతిగా అయిపోయినా, నడక కూడా మారిపోయినా, ఆమె లావణ్యేనని అతనికి తెలుసును. ఇన్ని సంవత్సరాల నించి ఒక జ్ఞాపకం కోసమూ, తాను చేసిన ఒక అన్యాయానికీ మూర్ఖత్వానికీ శిక్షకోసమూ ఏకాకిగా తాను జీవితం వెళ్ళబుచ్చుతూన్నది ఆమె కోసమే. లావణ్యని ఎలాగ విస్మరించగలడు?

ఆమె ఎవరితోనో మాట్లాడుతూంది. అతను స్వామి. అవునా?

కాదా?.. అతన్ని కొద్ది క్షణాలు - బహుశః ఒక్క నిమిషం మాత్రం తాను చూశాడు కాని..

సుందరం కష్టంతో లేచి నిలబడ్డాడు. ఇంత నీరసంగా అతని కెప్పుడూ అనిపించలేదు!

ఆమె నలభై మీటర్ల అవతల ఉంది.

అక్కడ కూర్చుంటూంది అతనితో.

ఆరేళ్ల క్రితం ఆమె చివరిసారి తనతో అన్నమాట లతనికి జ్ఞాపకం వచ్చాయి... "వెళ్లు, సుందరం! నీ కోరిక ప్రకారం నా జ్ఞాపకం కావాలంటే దానితో బతుకు. కాని, మళ్ళీ నా

జీవితంలోకి రాకు... దయఉంచి ఈ ఉపకారం చెయ్యి!"

ఆమె హీనస్వరంతో అన్న ఆమాటలు ఇప్పటికీ సుందరానికి ఎంతో స్పష్టంగా జ్ఞాపకం ఉన్నాయి. అవి ప్రతి రోజూ అతనికి జ్ఞాపకం వస్తూనే ఉన్నాయి.

అటు వెళ్ళబోయిన సుందరం మరోవేపు అడుగులు వేసి కదిలాడు. అక్కడినుంచి వెళ్ళిపోవాలనీ, లావణ్యకి పొరపాటున కూడా కనిపించకూడదనీ అతను నిశ్చయించుకుని రెండడుగులు వేసినా, నాలుగో అడుగు వేసేసరికి అతను నిర్ణయం మార్చుకోలేక తప్పలేదు. అక్కడ ఒక చెట్టుమూలన అతను నీరసంగా కూర్చుని మళ్లీ లావణ్య ఉన్న దిక్కుగా చూశాడు. ఆమెకి తాను కనిపించడు గాని కొంచెం ప్రయత్నంతో ఆమె తనకి కనిపిస్తుంది.

అతను చెట్టుకి జారబడి కళ్లు మూసుకున్నాడు. చెట్టు వెన్నుకి గట్టిగా తగులుతూంటే, మరొక ఊరిలో మరొక కాలంలో ఇలాగే చెట్టుకానుకుని కూర్చుని, గుండెల మీద విశ్రమిస్తున్న మరో ప్రాణి బరువుని సంతోషంగా భరించడం జ్ఞాపకం వచ్చింది.

అప్పటికి తాను బి. కామ్, ముగించి ఇంటికి వచ్చాడు. తమ చిన్న ఊరు రామాపురంలో అతనికి ఉన్న స్నేహితులు మరీ తక్కువ. అటు పరీక్షా ఫలితాలని గురించీ, ఇటు తన భావి జీవితాన్ని గురించీ ఆందోళనతో రోజులు మెల్లిగా సాగుతూండేవి

లావణ్య కనిపించిన తరవాత అంతా మారిపోయింది.

చిన్ననాటి స్నేహితురాలు లావణ్య అప్పటికి పదహారేళ్ల చక్కటి అమ్మాయి. ఆ సాయంత్రం ఆమె ఏటిపక్క తోటలో కనిపించేదాకా అతని కామె ధ్యాస లేనేలేదు.

అతను ఆ సాయంత్రం తోటలోకి వెళ్లి ఏటి ఒడ్డున కూర్చుని జీవితం గురించీ, కదలని బరువైన ఆ రోజులని గురించీ ఆలోచించుకుంటూంటే పొద్దుటి నుంచీ అలుముకుంటూన్న మేఘాలు ఒక్కసారి వర్షించడం మొదలు పెట్టాయి.

ఏటి అవతల పొరుగూరి నించి బాట ఉంది. ఒక్కసారి వచ్చిన చినుకులతో బాటు ఆమె ఏటి ఇసుకలో నించి పరుగెట్టి తానున్న చోటికి వచ్చింది. అటు వంతెన దాకా నడిస్తే ఇంకా తడుస్తానని భయం.

తనని చూసి క్షణమాత్రం బిత్తర పోయి, అప్పుడు సంతోషంగా నవ్వుతూ, "నువ్వా. సుందరం! ఎవరోనని హడిలి పొయ్యాను!" అంది లావణ్య.

అప్పుడే అతనామెని గుర్తు పట్టాడు. ఆ కళ్లు తనకి తెలీకుండానే తన చిన్నతనం నించీ జ్ఞాపకం ఉండిపోయాయి.

"నువ్వా, లావణ్యా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును... నీకూ మానర్స్ వచ్చినట్టున్నాయే!"

"ఏం?"

"లవణం అనడం మానేశావు."

"మరిచి పోయాను."

ఆమె అతనికి దగ్గరగా, చెట్టుకింద పొడినేల మీద నిలబడి, "అవున్లే.. నువ్వు థర్డ్ ఫారంలో ఉండగా నేను అయిదులో ఉండేదాన్ని. అమ్మమ్మతో విశాఖపట్నం వెళ్లిపోయాను. నువ్వు బి. ఏ. పాసయ్యావటగా!" అంది.

"లే దింకా... పరీక్ష రాశాను. బి. కామ్.."

"అయిపోతావులే!"

"నువ్వు?"

"మెట్రిక్ చేసి ఊరుకున్నాను."

"ఏం"

"చాలుగా!... కాలేజీ చదువులు ఆడపిల్లలకి ఎందుకూ." అతను నవ్వాడు.

"అయినా, అమ్మమ్మ పోయాక ఇక్కడికివచ్చేశానులే.. కాలేజీ దగ్గరగా లేదు. కుదరదు - పోనీలే నీ మాట చెప్పు."

వర్షం ఉధృతంగా పడుతూంది. పరుగున వెళ్లి తోటలో ఉన్న ఖాళీ పాకలో ఇద్దరూ తల దాచుకున్నారు. ఆ తరువాత ఎంత సేపో ఎన్ని విషయాలో మాట్లాడుకున్నారు.

ఈరోజు ఇక్కడ కూర్చుని ఆ వర్షపు సాయంత్రం, తోటలో ఆ ఏకాంతసమాగమం, ఆమెని దగ్గరగా తీసుకుని తాను, చలికి తనలోకి కుంచుకుపోతూ ఆమె, తమకి వయస్సులో, అనుభవాలలో ఉన్న భేదాలన్నీ మరిచిపోయి - అన్నీ మరిచిపోయి మాట్లాడుకోవడం మనసులోకి తెచ్చుకుంటే అది కలలాగా, యవ్వనంలో మనసు తహ తహలాడిపోయే అనుభవంలాగా కనిపిస్తుంది.

ఆ రోజు ఎంత అనిష్టంగా వర్షం వెలవడాన్ని గమనించారు ఇద్దరూ! ఎంత అ నిష్టంగా ఇంటికి బయలు దేరారు!

ఆ తరువాత మూడు నెలలూ మూడు నిమిషాల్లాగ గడిచి పోయాయి. తన పరీక్ష ఫలితం తెలిసి, సి.ఎ. చెయ్యడానికి కలకత్తా వెళ్లే నిర్ణయం జరిగి, తాను కలకత్తా బయలుదేరే సమయం దగ్గరికి వచ్చేసరికి ఆ చిన్న ఊళ్లో లావణ్య పేరు అందరి నోటా పడింది. అప్పటి దాకా ఆమె కనిపించే సాయంత్రాల కోసం రోజంతా ఉరకలు వేసే అతని మనస్సులో ఈ

వాతావరణంలో తమ సమాగమాలు, ఆనందం, ఉల్లాసం కాక ఇంకాఏదో కలిగిస్తాయనే తలపు రాలే దతనికి.

ఆ సాయంత్రం మామూలుగానే సుందరం తోటలోకి వెళ్లి లావణ్యకోసం ఎదురుచూస్తూ తియ్యటి ఆలోచనలు సాగించాడు. ఆమె రావడం ఆలస్యమయిన కొద్దీ అతని ఉత్సుకత ఎక్కువ అయింది. తనతో ఆమె విలాసంగా ఆడే చాలా ఆటల్లో ఇది మరొకటి అనుకుని, సంతృప్తిగా నవ్వి అతను ఎదురు చూడడం సాగించాడు.

సాయంత్రం అయిపో వచ్చింది. సూర్యాస్తమానం అయిపోయి రాత్రికి సంధ్య లొంగిపోయినా లావణ్య రాలేదు.

అతనికి ఏమీ తోచలేదు. ఇన్నాళ్ళలో ఆమె తనని నిరాశ పరచడం ఇదే మొదటిసారి. ఒక్కసారి అతనికి తీవ్రమైన అసంతృప్తి కలిగింది. ఆ చక్కటి పరిసరాల సౌందర్యం ఆనందాన్ని ఇవ్వడం మాని ఆతనికి ఎంతో బాధ కలిగించింది. ఆమె తనతో గడిపిన గంటలన్నీ నిమిషాల వివరాలతో జ్ఞాపకం వచ్చి, వేదన కలిగించాయి.

చివరి కతను ఇంటికి బయలుదేరి దారిలో ఆమెని చూసి పోదామని అనుకున్నాడు. అతను తోటనించి బయటికి రాగానే అన్న ఎదురు వచ్చాడు. అతనితో మరో ఇద్దరు చేతుల్లో కర్రలు పట్టుకుని ఉన్నారు.

ఉపోద్ఘాతం ఏమీ లేకుండానే, "సుందరం! ఇంటికి పద - సాయంత్రం నించీ ఇక్కడే ఉన్నావా?" అన్నాడు అన్నయ్య.

"అవును.. ఏమిటి సంగతి?" అని అడిగాడు సుందరం.

"లావణ్యని నువ్వు తప్పుదారులు పట్టించావట?"

"నేనా?.. ఏమిటది?"

"తోటలో మీ ఇద్దరినీ చాలా మందిచూశారట - వాళ్ళ వాళ్లు నీ మీద పగబట్టారుట. ఇంటికి పద."

సుందరం కొయ్యబారి పొయ్యాడు.

"మరో నెలలో ఎలాగా కలకత్తా పోవాలి కదా! కొంచెం ముందు వెడితేసరి. వాళ్లు కసాయి వాళ్లు - అనవసరంగా గొడవపడ్డం ఎందుకు?" అన్నాడు అన్నయ్య.

"కాని. నేనేం తప్పు చెయ్యలేదన్నయ్యా! పారిపోవడం అంటే సిగ్గుగా ఉంది."

"దానికేంలే.. అయినా, ఊరిలో ఎవడూ నీ మాట నమ్మడుగా! వయసొచ్చిన పిల్ల - విలాసం ఎక్కువ... ఏమీ జరగలేదంటే నమ్మకపోగా, నవ్వుతారు."

ఆ రాత్రి తాను కలకత్తా వెళ్లిపోయాడు.

మరో మూడు సంవత్సరాలు తను రామాపురం రాలేదు.

ఆ తరువాత అన్నయ్యకి ఒంట్లో బాగులేదంటే వచ్చాడు. నాలుగు రోజులయ్యాక అన్నయ్యకి బాగా నయంగా ఉండి, తాను తిరిగి బయలుదేరుతూంటే అన్నయ్య యాదృచ్ఛికంగా లావణ్య మాట చెప్పు - ఆమెకి సంవత్సరం కిందట పెళ్లి అయిందనీ, భర్తకి విశాఖపట్నంలో ఉద్యోగం అనీ చెప్పి, "మన రామబ్రహ్మం ఉన్నాడు కాదూ, అక్కడే క్రింది పోర్షన్‌లో వాళ్లు ఉండడం - ఆ మధ్య వెడితే తెలిసింది" అన్నాడు.

సుందరం తల ఊపి, బయలుదేరాడు. అతనికి ఈ మూడేళ్ళలోనూ లావణ్య మీద భావం కొంత మారింది. ఆమె తన కోసం చెయ్య గలిగినది ఏదో చెయ్యలేదనీ, అనవసరంగా తనకి ఆమె అపనింద కలిగించిందనీ అతనికి చూచాయగా అనిపించింది. కాని, మొత్తం మీద ఈ వ్యవహారంలో తనదీ ఏదో లోపం ఉందనీ, మగవాడుగా తాను ఆదర్శంగా ప్రవర్తించ లేదని కూడా అతని కనిపించింది. ఒక విధంగా తాను లావణ్యని నిస్సహాయగా వదిలేశాడనీ, ఈ మూడేళ్లూ ఆమెని నిత్యమూ స్మరించి, ఆమెకోసం నిట్టూర్పులు విడవడంతో ఆమెకి తాను కొంత న్యాయం చేకూర్చినా, ఒక్కసారి ఆమెని చూసి తను వేదనని చెప్పి ఆమె వ్యథని అర్థం చేసుకుంటే తన విధి నిర్వర్తించడం అవుతుందనీ అతనికి అనిపించింది. ఆమెకి తన మీద ప్రచండమైన ప్రేమ ఉందనీ, ఆమె జీవితాంతం తన భాగస్వామినిగా ఉండాలని కలలు కని ఆశాభంగం చెందిందనీ సుందరానికి తెలుసును. తాను పలాయనం చేసి ఆమె చేత కన్నీరు కార్పించాడు. ఒక్క సారి ఆమెకి క్షమాపణ చెప్పాలి, అనుకున్నాడు సుందరం.

కలకత్తా వెడుతూ దారిలో అతను విశాఖపట్నంలో దిగి, సూట్‌కేసు క్లోక్ రూమ్‌లో పెట్టి అట్టే కష్టంలేకుండా లావణ్య ఇల్లు కనుక్కున్నాడు. ఆ తలుపు కొట్టేసరికి అతని గుండెలు ఎంతో దూరానికి విని పించేలాగ కొట్టు కోవడం అతనికి ఈ నాటికీ జ్ఞాపకం ఉంది.

ఆమె తలుపు తీసి అతి సంభ్రమంతో నిలబడిపోయింది. అప్పుడే స్నానం చేసిందిలాగ ఉంది - ఒంటిని అక్కడా అక్కడా తడి ఆరనేలేదు.

"మీరా!" అంది చివరికి.

అతను ఆమెకి కళ్ళప్పగించి ఊరు కున్నాడు.

"ఇల్లెలాగ తెలిసింది?"

"తెలుసుకున్నాను."

మళ్ళీ నిశ్శబ్దం. అతన్ని లోపలికి పిలువకుండా, సగం తీసిన తలుపుకి ఆమె అడ్డంగా నిలబడింది.

"నీతో నాలుగు నిమిషాలు మాట్లాడాలి..."

సంశయంగానే, "రండి" అంది లావణ్య.

అతను లోపలికి వెళ్ళి కూర్చున్నాడు. గుండె దడ ముందు కన్నా తగ్గినా, ఇంకా ఎక్కువగానే ఉంది. గది ఒక సారి పరిశీలించి చూశాడు. సోఫా, రేడియో, పుస్తకాలు..

లావణ్య నిలబడే ఉంది. "ఏమిటి?" అంది.

"ఒకసారి నిన్ను చూద్దా మనిపించింది" అన్నాడు తడబడుతూ సుందరం.

"అలాగా!" అంది లావణ్య పొడిగా.

"అప్పుడు.. హఠాత్తుగా కలకత్తా వెళ్ళిపోవాల్సి వచ్చింది"

"అవును."

"నువ్వు అపార్థం చేసుకున్నా, న్యాయమే...."

ఆమె చిరునవ్వు నవ్వినా, అది నెర్వస్‌గా ఉంది.

"అపార్థం, అర్థం - అన్నీ ఒకటే అలాటి వాటిలో!"అంది.

"నిన్ను నిజంగా ప్రేమించాను... మోసం చేద్దామనీ, ఇలాగ అవుతుందనీ అనుకోలేదు..."

లావణ్య మళ్లీ అదే నవ్వు నవ్వింది, జడ వేసుకుంటూ.

"నిన్ను చాలా బాధ పెట్టాను..."

జడ అల్లడం ముగించి, అతనివైపు తిరిగి, "నాకు బాధ ఏమీలేదు లెండి - సుఖంగా ఉన్నాను. నాకున్న బాధ అంతా మీరి లాగ రావడమే; ఆయనకి అందరిలాగే అనుమానం బాగా ఉంది..." అంది లావణ్య దృఢంగా.

"కాని ...."

అతనేదో అనబోయే లోపున తలుపుతట్టిన శబ్దం వినిపించింది. లావణ్య ముఖంలో భయం, ఆశ్చర్యం.... తాను మరువని రూప చిత్రాలలో ఒకటిగా ఉండిపోయింది.

"చూడు - ఏం చేశావో!" నన్నట్టు అతని ముఖంలోకి చూసి వెళ్ళి ఆమె తలుపు తీసి వెనక్కి తగ్గింది.

లోపలికి వచ్చిన మనిషి తనని చూసి ఆగిపోయి ప్రశ్నిస్తూ లావణ్యవేపు చూశాడు.

"ఇతను సుందరం - మా - "

సగంలో అతను అడ్డువచ్చి "నాకు తెలుసులే. అతనితో మాట్లాడి లోపలికి రా" అని, సుందరాన్ని పలకరించకుండానే లోపలికి వెళ్ళి పోయాడు.

సుందరం లేచి, "సారీ .... నేను.. వెడతాను..." అన్నాడు ఒక అడుగువేసి.

"వెళ్ళు... కాని, నిన్నేదో ప్రేమించాననీ నీ కోసం కన్నీళ్లు కారుస్తూ కూర్చున్నాననీ అనుకోకు. నీ ప్రేమ నా మీద కాదు... అది ఒక సరదా.... రొమాన్సు....." ఆమె చిన్న గొంతుకతో అంది.

సుందరం జవాబిచ్చే లోపున, "నువ్వు ఒప్పుకోవు కాని, నాకు తెలుసును... నీక్కావలసింది ఒక జ్ఞాపకం - వెళ్లు సుందరం!... నీ కోరిక ప్రకారం కావాలంటే నాజ్ఞాపకంతో బతుకు. కాని, మళ్ళీ నా జీవితంలోకి రాకు. దయ ఉంచి ఈ ఉపకారం చెయ్యి!" అని తలుపు వేసుకుంది. ఆ మాట లామె రహస్యం చెప్తోన్నట్టు చిన్న గొంతుకతోనే అన్నా, అవి అతనికి కర్కశంగా వినిపించాయి.

అతను మెట్లుదిగి వీధిలోకి వచ్చి స్టేషనుకి బయలుదేరే దాకా ఏమి జరిగిందో అతనికి అర్థం కాలేదు. ఆ తరవాత రెండోసారి ఆమె జీవితంలో అవాంతరాన్ని తెచ్చి పెట్టానని తాననుకున్నాడు. భర్త అనుమానం మనిషి అని లావణ్య చెప్పింది కూడాను.

కాని, ఆ బాధ కన్న లావణ్య అన్నమాటలూ, ఆమె ప్రవర్తనా అతనికి ఎక్కువ బాధ కలిగించాయి.

అతను స్టేషనుకి చేరి, ఏదో తిని, మరో నాలుగ్గంటల తరవాత రానున్న హౌరా ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. బెజవాడ వేపు వెళ్ళేబండి ఒకటి మరో రెండు గంటల తరవాత వచ్చింది. కాలక్షేపంకోసం అతను దాన్ని గమనించాడు.

బండి వెళ్ళే సమయానికి హడావిడిగా వస్తూ లావణ్య కనిపించింది. ఈ కొద్ది సేపటిలోనూ ఆమె చాలా మారిపోయింది. కళ్లూ, ముఖమూ క్షణమాత్ర పరిశీలనలోనే ఆమె ఏడ్చి ఏడ్చి ఉందనీ, ఎంతో కష్టంమీద ఏడుపు కొంచెంసేపు ఆపుకున్నదనీ తెలియజేస్తూనే ఉన్నాయి.

ఆమె వెనక అతను చేతిలో చిన్న సూట్‌కేస్, సంచీ పట్టుకుని వస్తున్నాడు. రైలు కదిలేందుకు నిమిషం కన్న ఉన్నట్టు కనిపించలేదు. వాళ్ళిద్దరూ తొందరగా ఒక కంపార్ట్‌మెంటులో ఎక్కారు. రైలు నెమ్మదిగా ప్లాట్‌ఫారమ్ వదిలి వెళ్ళిపోయింది.

జరిగినది ఏమిటో సుందరం కొంచెం ఆలోచనతో తెలుసుకో గలిగాడు - తన మూలంగా లావణ్య జీవితం రెండోసారి పాడయిందన్నమాట. దురదృష్టం లాగ తానామెని

వెతుక్కుని వచ్చి ఆమెకు ఉన్న దుఃఖాలు చాల వన్నట్లు ఆమెకీ భర్తకీ మధ్య అనుమానాలని కలిగించాడన్న మాట. ఫలితం ఎంత వేగంగా కనిపించింది!

జరిగినదాన్ని మరో సారి నెమరు వేసుకున్నాక, సుందరం లావణ్య తన నింకా ప్రేమిస్తూనే ఉందని నిర్ధారణ చేసుకున్నాడు ఆమె తాను బాధపడకుండా తనతో పరుషంగా మాట్లాడి ఉంటుంది. మరో కారణం ఆమెభర్త మనస్తత్వం కావచ్చును. ఎంత హృదయ కాఠిన్యం ఉన్న ఆడదయినా ఒక సారి వలచిన వాణ్ని మరిచి పోలేదు. కాని, ఆ విషయం సూటిగా అంగీకరించకపోవడమూ దానికి విరుద్ధమైన ప్రవర్తనా స్త్రీ సహజమే కాకుండా సంసారిగా తన స్వరక్షణ కోసం కూడా అయి ఉంటుంది.

పాపం, లావణ్య! తన మూలంగా ఆమె సంసారం నాశనం అవుతూంది అని వాపోయాడు సుందరం. ఆమెకి ఉన్న మనోవేదనకి ఈ కొత్త బాధ కూడా తోడు తెచ్చాడు తాను.

ఆ క్షణంలోనే భీకరమైన ప్రతిజ్ఞ చేశాడు సుందరం - తన మిగిలిన జీవితం లావణ్యకోసం త్యాగం చేస్తానని. తనకి పెళ్ళీ, సంసార సుఖమూ ఉండకూడదు. ఆనాటి తమ ప్రేమకి తానిచ్చే కానుక అదే.

ఈ నాడు ఆ ప్రతిజ్ఞని మరోసారి జ్ఞాపకం తెచ్చుకున్నాడు సుందరం. ఇప్పటి దాకా తాను దానికి కట్టుబడి ఉన్నాడు. ఈ మూడు సంవత్సరాలలోనూ లావణ్య జ్ఞాపకం అతనికి ఆనందాన్నీ, దుఃఖాన్నీ హెచ్చు తగ్గుల పాళ్ళలో ఇస్తూ తన చేత ఆ ప్రతిజ్ఞా పాలన చేయించింది. ఎన్ని సంబంధాల గురించి అన్నయ్య, రాసినా తాను చలించలేదు. మూడు రోజుల క్రిందటే మరో సంబంధం గురించి రాశాడు అన్నయ్య, అమ్మాయి ఫోటో పంపుతూ. ఎంత అందంగా ఉంది! అయినా సరే! తాను నిగ్రహంతో జవాబు రాయకుండా ఊరుకున్నాడు.

ఇంతసేపూ సుందరం లావణ్యని గమనిస్తూనే ఉన్నాడు.

ఆమె కొంచెం దూరంలో కూర్చుంది. ఆమెతో స్వామి మాట్లాడుతున్నాడు. ప్రక్కన చిన్న అబ్బాయి ఆడుకుంటున్నాడు.

సుందరం నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. ఇక్కడి నించి వెంటనే వెళ్ళిపోవాలనిపించిందతనికి. లావణ్య, మనసులోనించి కాకపోయినా, నోటితో తనని కోరిన కోరిక అదే.

కాని. అతని అడుగులు ముందుకి పడలేదు.

తన జీవిత నాటకంలో అంత ముఖ్యమైన పాత్ర ధరించిన లావణ్య అంత దగ్గరగా

ఉంటే వొదిలి తానెలాగ వెళ్ళిపోతాడు? కనీసం ఒక్క నిమిషమైనా ఆమెతో మాట్లాడకుండా?

తానామెతో మళ్ళీ మాటలాడనని వాగ్దానం చెయ్య లేదు. ఒక నిమిషం అత నామెను పరిశీలనగా చూస్తూ చెట్టును అనుకుని అలాగే నిలబడి పోయారు.

స్వామి ఆమెతో ఏదో చెప్పి, పిల్లవాడిని ఎత్తుకుని ఎక్కడికో బయలుదేరాడు. ఆమె కూడా లేచి నిలబడింది. కాని, అత నేదో అని ఆమెని వదిలి వెళ్ళిపోయాడు. ఆమె కూర్చుంది.

దేవుడూ, మనిషి కలిపి తన హృదయపూర్వకమైన నిశ్శబ్దపు ప్రార్థనని విని ఈ అవకాశం ఇచ్చా రనిపించింది సుందరానికి. ఆమె వైపు త్వరగా అడుగులు వేశాడు.

మూడోసారి ఆమె జీవితంలో దురదృష్టంతేగలిగే సంభావ్యం అతన్ని క్షణమాత్రమే ఆపింది. మళ్ళీ ఆలోచన సాగే లోపునే సుందరం వెళ్ళి ఆమెకి ఎదురుగా నిలబడి, ఎండిపోయిన గొంతుకతో, "లావణ్యా! అన్నాడు.

ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసిన లావణ్య. "నువ్వా, సుందరం!" అంది.

ఆ ఏకవచన ప్రయోగం రగులుతూన్న అతని హృదయంలో మలయమారుతాన్ని సృష్టించింది. క్రిందటిసారి ఆమె బహువచనంలో మొదలు పెట్టి, ఏకవచనంలో పూర్తి చేసింది.

"అవును..."

"సర్ప్రైజ్!"

"అవును..."

"కూర్చో."

"వద్దులే. ఒక్క మాట అడుగుదామని వచ్చాను. నీ మాటలన్నీ జ్ఞాపకం ఉన్నా, నిన్ను చూసి పలకరించకుండా ఉండలేక పోయాను."

"ఏమిటది, సుందరం?"

"క్రిందటిసారి... నేను వెళ్లాక ఏమయింది?"

లావణ్య ముఖంలో చిరునవ్వు అంతం అయిపోయింది. ఆమె ఏమీ అనలేదు.

"అతనూ నువ్వూ... స్టేషన్లో కనిపించారు."

"అవును"

"ఏమయింది?"

"నాన్నగారు.... ఆ ఉదయం పోయారుట - ఆయన టెలిగ్రాం పట్టుకుని వచ్చారు."

"అరే! నేను తొలినాడే కదా బయలుదేరాను?"

"అప్పటికి బాగానే ఉన్నారు. హార్ట్ ఎటాక్."

"సారీ...."

లావణ్య తల ఊపి, సముదాయించుకుని, "నీకు పెళ్ళి అయిందా?" అంది.

"లేదు."

"ఏం?"

"నేను చేసుకోక ...."

"ఏం?"

"నీకు తెలుసును..."

లావణ్య చిరునవ్వుతో. "నా జ్ఞాపకాలా?" అంది.

"అవును!"

లావణ్య గట్టిగా నవ్వింది.

"చిత్రమైన మనిషివి నువ్వు!" అంది.

"ఏం?"

"నా కోసం నువ్వేమీ చెయ్యనక్కరలేదని అర్థం కాలేదా? ఒక వేళ నువ్వు నిజమే చెప్తూ ఉంటే, పెద్ద మూర్ఖుడివి అన్నమాట."

"నా విలువలు నావి..."

"కాని, దేనికోసం నీ విలువలు? మన రొమాన్సుకి ఆ చిన్న తనంలో ఇచ్చిన ప్రాముఖ్యం ఇప్పుడిస్తామా? అప్పటి కొలతల ప్రకారం మనం గొప్ప రొమాన్స్ చేసి ఆనందించాం ... నువ్వు మరీ మంచి వాడివి కనక జ్ఞాపకం ఉంచుకోవలసిందేదీ జరగలేదు మరిచిపోవలసిందీ జరగలేదు...!"

సుందరానికి బాధా, కోపమూ కలిసి వస్తున్నాయి. అతను తెల్లబోయి వింటున్నాడు.

"నాకు వివాహం అయింది. చాలా సుఖంగా ఉన్నాను. కూర్చో. మరోపది నిమిషాల్లో ఆయనా, వాడూ వస్తారు. ఈ సారి పరిచయం చేస్తాను."

"కాని అతని అనుమానం..."

లావణ్య మళ్ళీ నవ్వింది.

"చూడు నా మూర్ఖత్వం! ఆయన తత్వం నాకు అప్పటికి పూర్తిగా అర్థం కాక అలా అన్నాను. నా 'కథ' అంతా ఆయనకి తెలుసును. నా మీద ఆయన ఆప్యాయతనీ, ప్రేమనీ

నేను అపార్థం చేసుకున్నాను. నా మాట మీద ఆయనకి చాలా నమ్మకం ..."

సుందరం నిమిషం ఆగి, "కాని లావణ్యా! మన మధ్య ఒక జ్ఞాపకానికైనా తావు లేదంటావా?" అన్నాడు.

లావణ్య మళ్లా నవ్వింది.

"ఏముంది?" అంది, నవ్వు ఆపి.

సుందరానికి తల తిరిగినట్టయింది. తాను ఇన్నాళ్లూ ఈ మనిషికోసమా త్యాగం చేసింది?

"పోనీ, లావణ్యా! ఏమీ లేదులే!" అన్నాడు బాధగా.

"అలా అనుకో... సుఖపడు. అయినా, నిలబడి ఉన్నావేం? కూర్చో" అంది లావణ్య.

అతనికి కూర్చోవా లనిపించలేదు.

"మరొక్క టడుగుతాను...." అన్నాడు.

"అడుగు."

"అప్పుడు - మన ఊళ్ళో... నిన్ను బాధ పెట్టారా?"

"ఎందుకు?"

"నాతో అలా ఉన్నందుకు."

"అదా! ఒక గంట... అమ్మ, నాన్న అరిచారు. అంతే. నా క్కోపం వచ్చి పడుకుంటే బ్రతిమాలారు.. ఆ మరునాటికి నువ్వు పలాయనం చిత్తగిస్తే నాన్న ఒకటే నవ్వు!"

"కాని, ఆయన నన్ను కొట్టిస్తాడని...."

మరీ ఎక్కువగా నవ్వింది లావణ్య. "మా నాన్నా? గాడ్!" ఆమె నవ్వుతూనే ఉంది.

సుందరం త్వరత్వరగా నడిచి బయట పడి, మూడేళ్ళ అల వాటు మార్చి టాక్సీలో ఇంటికి బయలు దేరాడు. తనని ఆమె వెనక్కి పిలిచిందని అతనికి అనుమానం. కాని వెనుదిరిగి చూడలేదు.

ఇంటిలోకి వెళ్ళి మంచినీళ్ళు తాగి, మంచం మీద కూర్చుని సుందరం తీవ్రమైన ఆలోచన సాగించాడు.

లావణ్య తన సుఖం కోసం నటించిందా?

లేక, ఆమె నిజం చెప్పిందా?

ఎంత ఆలోచించినా అతనికి ఆమె తన కోసం అబద్ధ మాడిందనే నమ్మిక పోలేదు.

కాని, ఆమె నవ్వు ఇంకా అతనికి వినిపిస్తూనే ఉంది.

ఆమె ముఖంలో ఎక్కడా బాధ ఏమీ లేదు. అది మాత్రం నిజం.

ఈసారి ఆమె తనకి ఏం చెప్పింది?

పెళ్ళి చేసుకొమ్మని.

సూటిగా కాదు - అది లావణ్య పద్ధతి కాదు.

కాని ఆమె ఉద్దేశం స్పష్టంగానే ఉంది.

అతని ఆలోచనలో తాను మరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నా, లావణ్య జ్ఞాపకాలతో బాధపడక తప్పదని అనిపించింది. ఫలించని ఆమె ప్రేమ తన జీవితాన్ని ఎల్లప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. అందులో చాలా అసుఖం ఉంది. తానూ సంసారి అయితే లావణ్యకి కొంత శాంతి ఉండ వచ్చును.

సుందరం ఒక్క సారి మంచం మీద నుంచి దిగి, అన్న రాసిన ఉత్తరం కోసం వెదకడం ప్రారంభించాడు. ఆ ఫొటోలోని అమ్మాయి.. ఎంత స్వీట్‌గా ఉందో!

✧ ✧ ✧